ముమ్మరంగా రబీ నాట్లు

- వ్యవసాయ పనులతో రైతుల బిజీ
- సార్వా లేకపోవడంతో ముందస్తు నాట్లు


అంతర్వేదిపాలెంలో దాళ్వా చేలను దమ్ము చేస్తున్న ట్రాక్టర్


గుడిమెళ్ళంకలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

మలికిపురం: ప్రస్తుత దాళ్వా సీజన్‌లో వ్యవసాయ పనులతో గ్రామాలు కళకళలాడుతున్నాయి. ఇప్పటికే రాజోలు దీవిలో 20 శాతం నాట్లు పూర్తయ్యాయి. రాజోలు దీవిలో సార్వా సాగు సగానికి పైగా ఆయకట్టులో వేయలేదు. దీంతో ముందస్తు దాళ్వా సాగు ప్రారంభం అయింది. రాజోలు దీవిలో పలు గ్రామాల్లో గత పదేళ్లుగా రైతులు సార్వాకు పంట విరామం ప్రకటిస్తున్నారు. రాజోలు దీవిలో ఉప్పునీటి, ముంపు బెడదతో పాటు సాగులో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు కేశవదాసుపాలెం, అంతర్వేదికర, దేవస్థానం, అంతర్వేదిపాలెం, వుయ్యూరి వారిమెరక, శృంగవరప్పాడు, గొంది, రామేశ్వరంలో గత సార్వాకు స్వస్తి చెప్పారు. ఆ రైతులు కూడా దాళ్వా సాగు పనులు ముమ్మరంగా చేస్తున్నారు. ఇప్పటికే నారుమడులు తయారు కాగా చాలా ఆయకట్టులో వరి చేలను దమ్ము చేయిండంతో పాటు, గట్టులంక వేయడం, మెరకలు సరి చేయడం వంటి పనులు సాగిస్తున్నారు. పూర్వం నుంచీ దాళ్వా కంటే సార్వా పంట సాగే అధిక విస్తీర్ణంలో జరిగేది. వైపరీత్యాల ఇబ్బందులు ఉన్నా సార్వా సాగుకు రైతులు ఉత్సాహంగా ముందుకు వెళ్లేవారు. దీనికి కారణం సార్వా సాగుకు సాగునీటి కొరత అనేది ఉండదు. భారీ వర్షాల వల్ల తెగుళ్ల బెడద కూడా అంతగా ఉండేది కాదు. దాళ్వా సాగులో కాలువ శివారు భూములకు నీరు అందడంలో ఇబ్బందులు ఉంటాయి. పైగా వర్షాలు ఉండవు. అయితే ప్రస్తుతం ముంపు తీవ్రత, డ్రైన్స్ పని చేయక ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో సార్వా సాగుపై రైతులు విరక్తి చూపడం వల్ల ప్రస్తుతం దాళ్వా సాగుపై ఉత్సాహంగా సాగిస్తున్నారు. రాజోలు వ్యవసాయ సబ్ డివిజన్‌లో సఖినేటిపల్లి మండలంలో సుమారు 7500 ఎకరాలు, మలికిపురం మండలంలో సుమారు 3 వేల ఎకరాలు, రాజోలు మండలంలో సుమారు 7600 ఎకరాల్లో వరి ఆయకట్టు ఉంది. మారిన పరిస్థితుల నేపథ్యంలో సఖినేటిపల్లి మండలంలో 1600 ఎకరాలు, మలికిపురం మండలంలో 1600 ఎకరాలు, రాజోలు మండలంలో 4500 ఎకరాలలో మాత్రమే ప్రస్తుత రబీ నాట్లు పడుతున్నాయి. మిగిలిన ఆయకట్టు రొయ్యలు, చేపల సాగుతో పాటు ముంపు ప్రాంతాలుగా మిగిలిపోయాయి. గత సార్వా సాగులేని కేశవదాసుపాలెం, అంతర్వేదికర, దేవస్థానం, అంతర్వేదిపాలెం, వుయ్యూరి వారిమెరక, శృంగవరప్పాడు, గొంది, రామేశ్వరంలో కూడా సుమారు 700 ఎకరాల్లో దాళ్వా అదనంగా సాగు చేస్తున్నారు. సార్వా సాగు మాత్రం ఈ మండలంలో కేవలం 500లోపే సాగు జరిగింది. డిసెంబరు నెల ప్రారంభంలోనే నారు మడులు ప్రారంభించిన రైతులు నారు తయారు కావడంతో నాట్లుకు సమాయత్తమయ్యారు. ప్రస్తుత రబీలో సఖినేటిపల్లి మండలంలో 15 శాతం నాట్లు పూర్తయ్యాయి. మలికిపురం మండలంలో 20 శాతం నాట్లు పడ్డాయి. రాజోలు మండలంలో సార్వా మసూళ్లు జరుగుతున్న కారణంగా కాస్త ఆలస్యంగా నాట్లు ప్రారంభం అయ్యాయి. మొత్తానికి ప్రస్తుతం రాజోలు నియోజకవర్గంలో 20 శాతం నాట్లు పూర్తయినట్లు వ్యవసాయాధికారులు అంటున్నారు. మిగిలిన ఆయకట్టులో చురుకుగా పనులు సాగుతున్నాయి. సాగునకు సరిపడా ఎరువులు, పురుగు మందులను సిద్ధం చేశారు.

సిద్ధంగా ఉన్న ఎరువులు



ప్రస్తుతం గ్రామాల్లో రైతులు చురుకుగా దాళ్వా సాగు పనులు చేస్తున్నారు. ముంపు బెడద కారణంగా ఇక్కడ సార్వా సాగు చేయలేదు. ఈ కారణంగా ముందస్తు దాళ్వా సాగు చేపట్టారు. అందుకు సిద్ధంగా ఎరువులు, పురుగు మందులు సిద్ధంగా ఉంచాం. రైతులు వరి చేలకు అవసరం మేరకు ఎరువులు, పురుగుమందులు వాడాలి.

– ఎస్.రాకేశ్, ఏఓ, మలికిపురం

ఉత్తమ పరిశోధకుడిగా 'యర్రంశెట్టి'


అవార్డు అందుకుంటున్న విజయ్‌సత్యప్రసాద్

మామిడికుదురు: కరేబియన్ సైన్స్, టెక్నాలజీస్, ఇన్‌సెట్ జర్నల్‌లో మామిడికుదురు డిగ్రీ కళాశాలకు చెందిన ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి డాక్టర్ యర్రంశెట్టి విజయ్‌సత్యప్రసాద్ సమర్పించిన బ్యూటీఫుల్ రిలేషన్‌షిప్ బిట్వీన్ నానో టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ పరిశోధనా పత్రానికి ఉత్తమ పరిశోధన పత్రం అవార్డు లభించింది. నానో టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ రెండూ ఒక దానిపై మరొకటి ఆధారపడే విధానం, కంప్యూటర్స్‌లో నానో పదార్థాలు ఉపయోగపడే వైనం వంటి విషయాలను అందులో వివరించినందుకు ఉత్తమ పరిశోధకుడు అవార్డు కూడా అందుకున్నారు. ఈ నెల 22, 23 తేదీల్లో తిరుచానూరు శ్రీపద్మావతి స్కూల్ ఆఫ్ ఫార్మసీలో జరిగిన అంతర్జాతీయ సమావేశంలో ఈ అవార్డులు అందుకున్నానని విజయ్ మంగళవారం తెలిపారు. అవార్డులు అందుకున్న విజయ్‌ను ఈ సందర్భంగా పలువురు అభినందించి, సన్మానించారు.

క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్ స్తంభంపై మంటలు


అంతర్వేదికర సైకిల్‌షాపు సెంటర్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్తంభంపై చెలరేగిన మంటలు

సఖినేటిపల్లి: అంతర్వేదికర సైకిల్‌షాపు సెంటర్లో సోమవారం అర్ధరాత్రి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్తంభంపై మంటలు చెలరేగాయి. స్థానిక విద్యుత్ శాఖ సిబ్బంది సహకారంతో వ్యాపారస్తులు, భవానీ యూత్ సభ్యులు మంటలను అదుపు చేయడంతో పెనుప్రమాదం తప్పింది.

'మాలే'కు ప్రతిభా పురస్కారం


శ్రీనివాస్ నగేష్‌ను మెమెంటోతో సత్కరించిన జాయింట్ కలెక్టర్ నిశాంతి

మలికిపురం: మలికిపురం, సఖినేటిపల్లి మండల వినియోగదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాలే శ్రీనివాస్ నగేష్‌కు ప్రతిభా పురస్కారం లభించింది. శ్రీనివాస్ నగేష్ వినియోగదారులకు అందిస్తున్న సేవలను గుర్తించి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి చేతుల మీదుగా మంగళవారం ఈ మేరకు దుశ్శాలువ, ప్రశంసాపత్రం, మెమెంటో, జ్ఞాపిక అందజేసి సత్కరించారు. అమలాపురంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని గోదావరి భవన్లో జరిగిన జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా పలువురు వినియోగదారుల సంఘాల నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి విజయభాస్కర్, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో బాధితులకు ఊరట


మలికిపురంలో సీఎంఆర్‌ఎఫ్ పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: పేదలకు వైద్య సాయం నిమిత్తం అందిస్తున్న సీఎం సహాయ నిధులతో ప్రజలకు ఎంతో ఊరట లభిస్తుందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ చేతుల మీదుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగింది. నలుగురు బాధిత కుటుంబాలకు రూ.6 లక్షల చెక్కులను అందించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, రాజోలు డీసీ పినిశెట్టి బుజ్జి, సర్పంచ్‌లు, యెనుముల నాగు, చెల్లుబోయిన హెలీనా, పిండి సత్యనారాయణ, కుంపట్ల చిన్నారి, న్యాయవాది ఆచంట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడికి రూ.12 వేల సాయం


బాధితుడి అక్కకు సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: ప్రమాదంలో శరీరం కాలిపోయిన బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు మంగళవారం రూ.12 వేల చెక్కును సాయంగా అందజేశారు. అంబాజీపేట మండలం గంగలకుర్రు గ్రామానికి చెందిన దంగుడు బియ్యం సాయిస్వామి నాయుడు (21) హైదరాబాద్‌లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఐదు రోజుల క్రితం సోలార్ హీటర్ పేలి ప్రమాదంలో వీపు మీద, కాళ్ల మీద శరీరం మొత్తం కాలిపోయింది. వైద్యానికి రూ.3 లక్షల వరకూ ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పారు. ఆర్థికస్తోమత లేక పేషెంట్ బంధువులు కాశీ అన్నపూర్ణదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరగా అమలాపురంలో బాధితుడి అక్క సలాది దుర్గా ప్రసన్నకి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.12 వేల చెక్కును అందజేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

పి.గన్నవరం: బెల్లంపూడిలో వేంచేసిన అభయాంజనేయ స్వామి వారి ఆలయ 18వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వారిని తమలపాకులు, తులసి దళాలు, వివిధ రకాల పూల మాలలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారికి పూజలు చేశారు. బండి నాగేశ్వరరావు, బండి నాగరత్నం, బండి వీర రాఘవులు, నారాయణ మూర్తి కుమారులు, బండి వారి కుటుంబ సభ్యుల సహకారంతో భక్తులకు భారీ అన్న సమారాధన చేశారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది


సఖినేటిపల్లిలో పొలం పిలుస్తోంది నిర్వహిస్తున్న ఏవో నరసింహారావు

సఖినేటిపల్లి: సఖినేటిపల్లి, సఖినేటిపల్లిలంక గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వపరంగా రైతులకు అమలు చేస్తున్న పథకాలు గురించి ఏవో పీవీ నరసింహారావు వివరించారు. ఆయా గ్రామాల్లో నారుమడుల్లోను, నాట్లు చేపడుతున్న చేలల్లోనూ చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై తగు సూచనలు ఏవో రైతులకు వివరించారు. నాట్లు వేస్తున్న రైతులు నత్రజని కనీసం మూడు దఫాలుగా వేయాలని, భాస్వరం పైరు ప్రారంభ దశలో వేస్తే వేర్లు అభివృద్ధికి, పిలకలు ఉత్పత్తికి దోహదపడుతుందని అన్నారు. అలాగే పొటాష్ వేయడం ద్వారా నాట్లు వేసింది మొదలు పంట కోత వరకూ కూడా ఉపయోగ పడుతుందని ఏవో తెలిపారు. ప్రజా ప్రతినిధులు, ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు


పెదపళ్ల పీహెచ్‌సీలో చిన్నారులకు టీకాలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి అన్నారు. ఆయా పీహెచ్‌సీల ఆవరణలో స్థానిక హెల్త్ సిబ్బంది మంగళవారం చిన్నారులకు టీకాలు అందజేశారు. చిన్నారులకు టీకాలు, బాలింతలకు, గర్భిణులకు ఇంజక్షన్‌లను అందజేశారు. ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు టీటీ, డీపీటీ, మీజిల్స్, పెంటావాలెంట్, ఎంఆర్, హెపటైటిస్–బీ వ్యాక్సిన్లను అందజేశారు. బాలింతలకు, గర్భిణులకు బలవర్ధక ఔషధాలను, యాంటీ బయాటిక్ మందులను అందజేశారు. ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి వైద్యసేవలను పర్యవేక్షించారు. క్రిస్మస్ దృష్ట్యా బుధవారం సెలవు కావడంతో ఒక రోజు ముందుగానే ఈ టీకాల ప్రక్రియను ప్రారంభించినట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు. ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న జాయింట్ కలెక్టర్ నిశాంతి

అయినవిల్లి: జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ముమ్మిడివరంలో జిల్లా స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. వక్తృత్వ పోటీల్లో కొండుకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆర్ఎన్ఎస్‌బీ పవన్ మొదటి స్థానం, ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన మానేపల్లి ఆశ్రిత మూడో స్థానం దక్కించుకున్నారు. అలాగే వ్యాసరచన పోటీల్లో కొండుకుదురు పాఠశాలకు చెందిన ఏడిది నవ్య మూడో స్థానం దక్కించుకుంది. జిల్లా స్థాయిలో ఆరు బహుమతులకుగాను అయినవిల్లి మండలం మూడు బహుమతులు గెలుపొందింది. విజేతలకు జాయింట్ కలెక్టర్ నిశాంతి చేతుల మీదుగా నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేశారు. విజేతలను ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, పి.శ్రీనివాస్, ముక్తేశ్వరం, కొండుకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిమ్మకాయల గణేశ్వరరావు, వి.శ్రీహరి తదితరులు అభినందించారు.

పోరుబాటను విజయవంతం చేద్దాం


మలికిపురంలో పోరుబాట పోస్టర్ ఆవిష్కరించిన మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, నాయకులు

మలికిపురం: విద్యుత్ చార్జీలను ఇష్టానుసారం పెంచి ప్రజల నడ్డి విరుస్తున్న కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 27న మలికిపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పోరుబాట పేరుతో చేపట్టే ధర్నా, ర్యాలీని పూర్తి స్థాయిలో విజయవంతం చేద్దామని మాజీ మంత్రి, రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటరు గొల్లపల్లి సూర్యారావు పిలుపునిచ్చారు. మలికిపురంలోని పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం పోరుబాటు పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మోసాలని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు ఆయన సూచించారు. ప్రతిపక్షంలో ఉండగా ఓ మాట, అధికారంలోకి వచ్చాక ఓ మాట మాట్లాడే చంద్రబాబు ద్వంద్వ వైఖరిని ప్రజలు ఎండగట్టాలని కోరారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకు ఏకంగా రూ.15 వేల కోట్ల విద్యుత్ భారం మోపిందన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. ఇసుక విధానంతో పాటు, మద్యం విధానం కూడా ప్రజలను మోసగించే విధంగా రూపొందించి ప్రజలను దోచుకుంటున్నారని దుయ్యబట్టారు. 27న నియోజకవర్గం నలుమూలల నుంచి కూడా కార్యకర్తలు తరలిరావాలని సూచించారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు కుసుమ చంద్రశేఖర్, కట్టా శ్రీనివాసరావు, నాయకులు కూనపరెడ్డి రాంబాబు, రుద్రరాజు రంగరాజు, ఉచ్చుల దాస్, తాడి సహదేవ్, జిల్లెళ్ళ ఉదయ్, కొల్లాబత్తుల మున్నా, అడబాల జానకిరామ్, పితాని ఏసుబాబు, దివ్వి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి జిల్లాల స్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ విజేతలు వీరే..



విజేతలతో దెంతుకూరి రాంబాబురాజు, క్రీడాకారులు

మలికిపురం: స్థానిక శ్రీరామ బ్యాడ్మింటన్ అకాడమీ వ్యవస్థాపకుడు దెందుకూరి రాంబాబు రాజు ఆధ్వర్యంలో ఈనెల 20, 21, 22 తేదీల్లో ఉభయ జిల్లాల స్థాయిలో బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. విజేతలకు మంగళవారం మెమెంటోలు అందించారు. శ్రీరామ బ్యాడ్మింటన్ అకాడమీ (మలికిపురం), ఫ్రెండ్ షటిల్ క్లబ్, చెల్లిబోయిన వెంకట సీతారత్నం షటిల్ ఇండోర్ స్టేడియం రాజోలు (తాటిపాక), కోరుకొండ ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియం (రాజోలు), (పాలకొల్లు) కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, భీమవరం నుంచి 82 మంది పాల్గొన్నారు. 8 విభాగాల్లో జరిగిన పోటీల్లో ఆయా విభాగాల వారీగా ప్రథమ స్థానంలో కె.హరికిష్ట (కోచ్), నాని, డి.కృష్ణ చైతన్య, ఆర్.విఠల్, సునీల్, విశాల్ రాజు, పి.ఏసుబాబు, వై.సాయిరాం, ఎం.రియాన్, ఎస్.జస్వంత్, కేఎస్‌బీడీ కార్తికేయ (జూనియర్ కేడీ ప్రసాద్), రెండో స్థానంలో ఎస్‌కే పెద్దిరాజు, జి.అంజి, వెంకటేష్, నేతికొండ కిరణ్, పి.రత్తయ్య, శశి, బి.రాజేంద్ర, వినీత్, నాని, ఎస్.జీవన్, మూడో స్థానంలో పి.పవన్ కుమార్, ఎ.దిలీప్ రాజు, సత్యనారాయణ, యు.రఘురాజు, టి.విజయ్‌కుమార్, ఎస్‌కే ఇంతాల్, నీలా ప్రసాద్, ఎ.నాగబాబు, కె.తిరుపతి రాజు, జంపయ్య (ఎస్సై), జి.సింధు విజేతలుగా నిలిచారు. విజేతలను శ్రీరామ బ్యాడ్మింటన్ అకాడమీ అధినేత దెందుకూరి రాంబాబురాజు విజేతలకు మెమెంటోలను బహుకరించి సత్కరించారు. ఎం.సత్తిరాజు, పి.జాన్ విలియమ్స్, ఎస్.శివకుమార్, జంపెయ్య, పెద్దిరాజు, హరికిష్ట (కోచ్) తదితరులు పాల్గొన్నారు.

పంటబోదెలు బాగు చేయాలి


మడుపల్లిలో పిచ్చిమొక్కలు, మట్టితో పూడుకుపోయిన పంటబోదె

అయినవిల్లి: పంట బోదెలు బాగు చేయాలని అయినవిల్లి మండలం మడుపల్లి రైతులు కోరుతున్నారు. దాళ్వా పంటకు నారుమడులు వేసేందుకు రైతులు సన్నద్ధమయ్యారు. అయితే పంటబోదెల్లో పిచ్చి మొక్కలు మొలిచి మట్టితో పూడుకున్నాయి. దీంతో సాగునీరు శివారుకు సరఫరా కాకపోవడంతో వరి నారుమడులు ఆలస్యమవుతున్నాయని రైతులు చెబుతున్నారు. పంటబోదెల్లో పూడిక తొలగించాలని రైతులు ఇరిగేషన్ అధికారులను కోరుతున్నారు. శివారు పంటచేలల్లో నారుమడులు వేసుకునేందుకు వెసులుబాటు కలుగుతుందని వారు చెబుతున్నారు. రైతుల గోడును పట్టించుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులను రైతులు కోరుతున్నారు.

ఆదిత్యకిరణ్‌కు విశిష్ట అవార్డు


కొత్తపేట: జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా వినియోగదారులకు విశేష సేవలందించినందుకు కొత్తపేటకు చెందిన కోకో ఫెడ్ కార్యదర్శి, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల వినియోగదారుల జేఏసీ సభ్యులు సత్తిరాజు ఆదిత్యకిరణ్ రాష్ట్ర స్థాయి విశిష్ట అవార్డు అందుకున్నారు. విజయవాడ శ్రీ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా మంగళవారం ఆయన ఈ అవార్డు అందుకున్నారు.ఈ సందర్భంగా అవార్డు అందుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు.పలువురు అభినందనలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు.

ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు


అవిడి సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గంగాధరరావు

కొత్తపేట: ప్రజలకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాలని వైద్యులకు, సిబ్బందికి ఎంపీపీ, అవిడి వానపల్లి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ మార్గాన గంగాధరరావు సూచించారు. మంగళవారం జరిగిన అవిడి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. పీహెచ్‌సీలో అందిస్తున్న వైద్య సేవలు, రక్త పరీక్షలను పరిశీలించారు. పీహెచ్‌సీ సేవలు, మందులు, వివిధ సౌకర్యాలపై సమీక్షించారు. వివిధ అనారోగ్యాలతో పీహెచ్‌సీకి, సబ్ సెంటర్లకు వచ్చిన ప్రతి ఒక్కరూ సంతృప్తికరంగా తిరిగి వెళ్లే విధంగా వైద్య సేవలందించాలని కోరారు. సమావేశంలో కమిటీ సభ్యుడు, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, ఎంపీడీఓ నరేష్ కుమార్, కన్వీనర్, వైద్యాధికారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎగసిపడుతున్న సముద్రం


అంతర్వేది బీచ్ వద్ద ఎగసిపడుతున్న కెరటాలు

సఖినేటిపల్లి: అంతర్వేది బీచ్ వద్ద సముద్రం ఎగసిపడుతూ కెరటాలు మంగళవారం తీరాన్ని తాకుతున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో కెరటాలు ఎగసి పడుతున్నాయి. దీనికి తోడు తీరం వెంబడి వీస్తున్న ఈదురు గాలులతో కెరటాలు తీవ్రత కూడా పెరిగింది.

ఓటు వేసి గెలిపించండి

అయినవిల్లి: తనకు ఓటు వేసి గెలిపించాలని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేపకాయల రాజు ఓటర్లను అభ్యర్థించారు. మంగళవారం రాజు ఎన్నిక ప్రచారం ప్రారంభించారు. రాజు మాట్లాడుతూ ఎన్నికల్లో నిరుద్యోగులు, ప్రైవేటు ఉద్యోగులు, విద్యావేత్తల ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు తన వెనుక పార్టీలు లేవని పట్టభద్రులే తన బలం, బలగం అని పేర్కొన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించే దిశగా అడుగులు ముందుకు వేస్తున్నానన్నారు.

క్రీస్తు చూపిన మార్గంలో పయనించాలి


ఉచ్చులవారిపేట క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం: ఏసుక్రీస్తు చూపిన శాంతి మార్గంలో అందరూ పయనించి తోటి వారికి సహాయపడాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఊడిమూడి శివారు చింతావారిపేట చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. క్రిస్మస్ అనేది ఒక పండుగ మాత్రమే కాదని, అది మనిషిని నిరంతరం సన్మార్గంలో నడిపించే దైవిక భావన అని అన్నారు. నియోజకవర్గ ప్రజలకు, క్రైస్తవ విశ్వాసులకు ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే క్రిస్మస్ కేకును కట్ చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఆలమూరు: క్రీస్తు జన్మదిన వేడుకలను బుధవారం నిర్వహించుకునేందుకు సర్వం సిద్ధమైంది. ఇప్పటికే వివిధ గ్రామాల్లోని క్రైస్తవ ప్రార్థనా చర్చిలు విద్యుత్ అలంకరణతో కళకళలాడుతున్నాయి. క్రైస్తవ ఆలయాల వద్ద, భక్తుల నివాసంలోనూ క్రీస్తు ప్రతిరూపమైన ధృవతారలు ప్రకాశిస్తున్నాయి. క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు మత ప్రబోధకులు ఇప్పటికే ప్రత్యేక చర్యలు పూర్తి చేశారు.

మామిడికుదురు: క్రిస్మస్ వేడుకలు మామిడికుదురులో మంగళవారం ఘనంగా జరిగాయి. మామిడికుదురు స్కూల్లో శాంతాక్లాస్, మేరీమాత వేషధారణలో విద్యార్థులు సందడి చేశారు. హెచ్ఎం డీవీవీ సత్యనారాయణ క్రిస్మస్ కేక్ కట్ చేశారు. క్రిస్మస్ ట్రీలను ఏర్పాటు చేశారు. ఏసుక్రీస్తు జననానికి సంబంధించిన ఘట్టాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఏసుక్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమం ఆద్యంతం ఘనంగా జరిగింది. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు.

పి.గన్నవరం: ఆర్.ఏనుగుపల్లిలోని హౌస్ ఆఫ్ ప్రేయర్ మందిరంలో పాస్టర్ వై.డేవిడ్ ప్రకాష్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా క్రిస్మస్ కేకును కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గిడ్డి ఆనంద్, యన్నపు పెద్ద, కడలి శంకరం, అధిక సంఖ్యలో క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లిలంక ఆర్సీఎం చర్చిలో క్రిస్మస్ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఫాదర్ ఆరాధ్య స్వామి ఆధ్వర్యంలో కేకు కట్ చేసి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా క్రిస్మస్ ట్రీ, పశువుల పాక ఆకట్టుకున్నాయి. చిన్నారులతో ఏర్పాటు చేసిన నృత్యప్రదర్శనలు మంత్రముగ్ధులను చేశాయి. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరిపారు.